క్లుప్తంగా

ఏపీఎంగా కల్పలత


కల్పలత

పాలసముద్రం: మండల ఏపీఎంగా కల్పలత బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆమె జీడీనెల్లూరు మండలం ఏపీఎంగా విధులు నిర్వహిస్తూ, బదిలీపై పాలసముద్రం మండలానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంఘాల బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. అర్హులైన ప్రతి సంఘానికి రుణాలు మంజూరు చేస్తామని, సంఘ సభ్యులు తమ రుణాల చెల్లింపులో గ్రేడింగ్ తగ్గకుండా చూడాలని కోరారు. సంఘ మిత్రలు కూడా ఎలాంటి లాభాపేక్ష లేకుండా విధులు నిర్వహించాలని సూచించారు.

శ్మశాన స్థలం చూపించండి


తక్కువ స్థలంలో విజయపురం శ్మశానం

విజయపురం: మండల కేంద్రంలో శ్మశానానికి స్థలం లేక అవస్థలు పడుతున్నారు. విజయపురం గ్రామంలో 300 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. పేరుకే మండల కేంద్రమైనప్పటికీ కనీసం శవాలను పూడ్చడానికి కూడా సరైన స్థలం లేదు. గ్రామంలో పెద్ద పెద్ద రాజకీయ నాయకులు, పలుకుబడి ఉన్న పెద్దలు ఉండి కూడా ఈ దుస్థితి రావడానికి కారణం ఏమిటో అర్థం కావడం లేదు. వందల ఎకరాల ప్రభుత్వం భూములు ఉన్నా శ్మశానానికి ఒక ఎకరా స్థలం ఇవ్వడానికి అధికారులు ముందుకు రావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూడ్చిన శవంపైనే మళ్లీ పూడుస్తున్నామని వాపోతున్నారు.

విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు


విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ మంజువాణి

పాలసముద్రం: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల దృష్టిలోపాలు గుర్తించేందుకే కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని చిత్తూరు డాక్టర్ మంజువాణి తెలిపారు. బుధవారం వెంగళరాజుకుప్పం, పాలసముద్రం ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు చేశారు. ఆమె మాట్లాడుతూ చిన్న వయస్సులోనే దృష్టి లోపాలు వచ్చే అవకాశాలున్నాయని తెలిపారు. అందుకే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పరీక్షలు చేసి, కంటి అద్దాలు ఇస్తామని తెలిపారు. అనంతరం వెంగళరాజుకుప్పంలో 115, పాలసముద్రంలో 165 మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ మురళి, ఏఎన్‌ఎం పాల్గొన్నారు.

హరిప్రకాష్ సేవలు అభినందనీయం


జూనియర్ అసిస్టెంట్ హరిప్రకాష్‌కు సన్మానం

కార్వేటినగరం: ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా హరిప్రకాష్ ఎనలేని సేవలు అందించారని కత్తెరపల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వాసుదేవరెడ్డి అన్నారు. బుధవారం బదిలీపై డీఎం పురం ఉన్నత పాఠశాలకు వెళ్లిన హరిప్రకాష్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా సన్మానించారు. కష్టపడి పనిచేసే వారు ఎక్కడున్నా ఉన్నత శిఖరాలకు చేరుకోగలరని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, మాజీ డీసీసీబీ జిల్లా కార్యదర్శి హేమారెడ్డి అన్నారు.

రైతులు ప్రీమియం చెల్లించాలి


మాట్లాడుతున్న ఏఓ వరలక్ష్మి

ఐరాల: రబీ సీజన్‌లో రైతులు సాగు చేసే ప్రధాన పంటలకు పంటల బీమా వర్తించాలంటే ప్రీమియం చెల్లించాలని ఏఓ వరలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని కామినాయనపల్లె రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. భూసార పరీక్షలు, విత్తనాల ఎంపిక, క్రిమిసంహారక మందుల వాడకంలో వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. ఉద్యానశాఖ తరఫున రైతులకు బిందు, తుంపర్ల సేద్యం పరికరాలు సబ్సిడీ అందిస్తున్నామని, అదేవిధంగా నూతనంగా రైతులు నాటుకునే మామిడి, కొబ్బరి, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, అరటి, బొప్పాయి, ఉసిరి, చింత పంటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని ఉద్యాన సహాయకులు రామచైతన్య తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బంగారమ్మ పాల్గొన్నారు.

అద్దె అవస్థలు

అంగన్‌వాడీ కేంద్రాలు సరైన వసతులు లేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. చిన్న పిల్లలు, గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం అందించే ఈ కేంద్రాలు దుర్భర స్థితిలో ఉన్నాయి. ఈ కేంద్రాల్లో చక్కటి సేవలు అందించడంతోపాటు చిన్నారుల ప్రీ స్కూల్ నిర్వహణకు చర్యలు తీసుకున్నారు. అయితే అంగన్‌వాడీలలో ఆట వస్తువులు, సరైన వాతావరణం, సొంత భవనాలు లేక చిన్న పిల్లలు, గర్భిణులు, బాలింతలు తీవ్ర అసౌకర్యాలకు గురవుతున్నారు.

– శ్రీరంగరాజపురం

- అద్దె భవనాల్లోనే అంగన్‌వాడీలు
- శాశ్వత భవనాలు నిర్మించాలని డిమాండ్
- శిథిలావస్థకు చేరిన పక్కా భవనాలు
- పలు కేంద్రాల్లో వసతులు కరువు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



అద్దె భవనంలో కొనసాగిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం

అంగన్‌వాడీ వ్యవస్థ ప్రారంభమై దాదాపు 40 ఏళ్లు గడిచినా నేటికి అక్కడక్కడా సొంత భవనాలు ఏర్పాటు చేయకపోవడంతో సిబ్బంది నానా అవస్థలు పడుతున్నారు. పాడుబడ్డ భవనాలు, వర్షాకాలం వచ్చిందంటే గదుల్లోకి నీరు చేరడం, అసౌకర్యాలతో కూడిన అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. దీంతో చిన్నారులు, బాలింతలు గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పక్కా భవనాల కొరత పట్టి పీడిస్తోంది. దీంతో చిన్నారులు సైతం బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రహరీలు లేక అపరిశుభ్రంగా తయారయ్యాయి. శ్రీరంగరాజపురం మండలం పిల్లిగుండ్లపల్లి ఎస్టీ కాలనీకి చెందిన పిల్లలు, బాలింతలు, గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లాలంటే 2 కిలోమీటర్ల నడవాల్సిందే. వర్షం వచ్చిందంటే చాలా పెద్ద సాహసం చేయాల్సిందే. ఇలాంటి పరిస్థితులు నేటికి చాలా ప్రాంతాల్లో ఉన్నాయి.

కూలేందుకు సిద్ధంగా భవనాలు

అంగన్‌వాడీ పక్కా భవనాలు శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. చిత్తూరు జిల్లాలోని 2420 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి వీటిలో ప్రభుత్వ పక్కా భవనాలు 1104, అద్దె భవనాలు 600 ఉన్నాయి. ప్రీస్కూల్ భవనాలు 716 ఉన్నాయి. ఇందులో దాదాపు 50 శాతం భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్ని చోట్ల పక్కా భవనాలకు ప్రహరీ లేకపోవడంతో అంగన్‌వాడీ పరిసరాలు అపరిశుభ్రంగా మారిపోతున్నాయి. ఇక అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న కేంద్రాల సంగతి చెప్పనక్కర్లేదు. గాలి, వెలుతురు, నీటి వసతి సరిగా లేక ఇరుకు గదుల్లో నడుస్తున్నాయి. దీంతో అంగన్‌వాడీ కార్యకర్తలు, లబ్ధిదారులు పిల్లలు చాలా ఇబ్బంది పడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించాలని పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని పిల్లల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పక్కా భవనాల నిర్మాణానికి కృషి చేయాలని కోరుతున్నారు.


పిల్లలకు విద్యను బోధిస్తున్నా అంగన్‌వాడీ కార్యకర్త

భవనం మంజూరు చేయాలి



అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేక అద్దె భవనంలో నిర్వహిస్తున్నాం. 50 బసివిరెడ్డిపల్లి దళితవాడలో పక్కా భవనం లేక చాలా ఇబ్బంది పడుతున్నాం. అద్దె భవనంలో సరైన వసతులు లేవు. పిల్లలు, గర్భిణులు, బాలింతలు ఇబ్బంది పడుతున్నారు. వర్షం వస్తే అంగన్‌వాడీ కేంద్రం ఉరుస్తోంది. దీంతో పౌష్టికాహారంతోపాటు నిత్యావసర వస్తువులు తడిసిపోతున్నాయి. వర్షం వస్తే పిల్లలు కేంద్రానికి రావడం లేదు. అంగన్‌వాడీ కేంద్రం మంజూరు చేయాలి.

– కె.చంద్రిక అంగన్‌వాడీ కార్యకర్త, 50 బసివిరెడ్డిపల్లి

పూర్తి స్థాయిలో భవనాలు నిర్మిస్తాం



పూర్తి స్థాయిలో భవనాలు నిర్మించడానికి అన్ని చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే జిల్లా పరిధిలో సొంత భవనాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఇప్పటికే కొన్ని భవనాలు నిర్మించాం. మరిన్ని భవనాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వెంటనే త్వరలోనే నిర్మిస్తాం.

– కె.హైమావతి, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్, చిత్తూరు జిల్లా

నిధులు తిరిగి చెల్లింపు

సాక్షి ఎఫెక్ట్..

విజయపురం: ఉప సర్పంచ్, వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమానికి విడుదల చేసిన నిధులను విజయపురం ఇన్‌చార్జి ఎంపీడీఓ తిరిగి బ్యాంక్‌లో చెల్లించారు. సాక్షి దినపత్రికలో 'నిధులు స్వాహా' అనే శీర్షికన సోమవారం వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎక్కువ మొత్తంలో డ్రా చేసిన నిధులను తిరిగి బ్యాంక్‌లో చెల్లించారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి స్కంధగురు అలంకారం


స్కంధగురు అలంకరణలో సుబ్రమణ్య స్వామి

నగరి: పట్టణ పరిధిలోని కరకంతేశ్వర స్వామి ఆలయంలోని సుబ్రమణ్యస్వామి సన్నిధిలో స్కంధషష్టి ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారికి స్కంధగురు అలంకారం చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేసి పుష్పాలంకరణ చేపట్టారు. ఆలయ ప్రదక్షిణ చేసి భక్తుల దర్శనార్థం ఆలయ మండపం వద్ద ఉంచారు. అలంకరణలు భక్తులను అమితంగా ఆకట్టుకున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో ఈ పూజలకు హాజరయ్యారు. హారతి పూజలు, ఊంజల్ సేవ నిర్వహించిన అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ అర్చకులు దుర్గాప్రసాద్ పూజలను నిర్వహించగా ధర్మకర్త సుబ్రమణ్యం ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సమర్థవంతంగా పని చేయాలి


మాట్లాడుతున్న ఎంపీపీ శ్యామల శివప్రకాష్‌రాజు, హాజరైన పలు శాఖల అధికారులు

పాలసముద్రం: మండల పరిధిలోని అభివృద్ధి పనుల అమలులో అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని ఎంపీపీ శ్యామల శివప్రకాష్‌రాజు తెలిపారు. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ క్రిష్ణమహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం ఎంపీపీ మాట్లాడుతూ మండల పరిధిలో వివిధ రకాల ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణపై అధికారులు, ప్రజా ప్రతినిధులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పుష్ప, సర్పంచ్ మహేష్ బాబు, శోభ, జీవిత, అనే రేఖ, అమరావతి, ఎంఈఓ రాజేంద్రప్రసాద్, గిరిజ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ, వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ, హౌసింగ్ ఏఈ దాము, విద్యుత్ శాఖ ఏఈ వరదరాజులు, ఏఓ ఢిల్లీప్రసాద్, పశువైద్యాధికారి యశస్వి, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సబ్సిడీలో వేరుశనగ విత్తనకాయలు


వేరుశనగ విత్తనకాయలను దింపుతున్న కూలీలు

నారాయణవనం: సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలు బుధవారం మండలానికి చేరుకున్నాయి. గురువారం మండలంలోని పాలమంగళంలో ఎమ్మెల్యే ఆదిమూలం విత్తనాల పంపిణీ ప్రారంభిస్తున్నట్లు ఏఓ శోభారాణి తెలిపారు. రబీ సీజన్‌లో మండలంలో 1800 హెక్టార్లలో కసిమిట్ట, ఎరికంబట్టు, అరణ్యకండ్రిగ, తుంబూరు, నైనారుకండ్రిగ, పాలమంగళం సచివాలయాల పరిధిలో సాగు చేస్తారు. అయితే విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీ సరఫరా ఆలస్యం కావడంతో రైతులు అనంతపురం, కదిరి, బళ్లారి నుండి 40 కేజీల బస్తాను రూ.3,500కు కొనుగోలు చేసి విత్తడానికి సిద్ధమయ్యారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందాన ఆలస్యంగా సబ్సిడీ విత్తనాలు బుధవారం చేరుకున్నాయి. పాలమంగళం, అరణ్యంకండ్రిగ ఆర్బీకేలలో రైతులకు గురువారం నుండి వేరుశనగతో పాటు అంతర పంటగా మినుములను విక్రయించడానికి ఏర్పాట్లు చేసినట్లు ఏఓ శోభారాణి తెలిపారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన

తవణంపల్లె: పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని ఏఓ ప్రవీణ్ తెలిపారు. బుధవారం మండలంలోని నల్లపురెడ్డిపల్లె, అరగొండలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయన పంటల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు ఆరుతడి పంటలు సాగు చేస్తే తక్కువ వ్యయంతో అధిక దిగుబడి సాధించవచ్చని సూచించారు. నారు పోసే సమయంలో విత్తనశుద్ధి తప్పక చేయించాలన్నారు. రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులను అధికంగా వాడాలని వివరించారు. క్షేత్రస్థాయిలో రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నిర్విరామంగా పౌష్టికాహారం పంపిణీ


ఆస్పత్రిలో పౌష్టికాహారం అందుకున్న గర్భవతులు

నగరి: ప్రతి బుధవారం ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం విచ్చేసే గర్భవతులకు మాజీ మంత్రి ఆర్కేరోజా తన చారిటబుల్ ట్రస్టు ద్వారా నిర్విరామంగా పౌష్టికాహారం అందిస్తూనే ఉన్నారు. అధికారం ఉన్నా లేకున్నా తన సేవలను ఆమె కొనసాగిస్తున్నారు. గర్భిణులకు అన్నదానం అన్నది తాను రాజకీయ లబ్ధి కోసం చేసేది కాదని ఆమె నిరూపిస్తున్నారు. ఆమె చేస్తున్న ఈ సేవ ఆమె మంచి మనసుకు అద్దం పడుతోందని నగరి, పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పౌష్టికాహారం అందుకునే గర్భవతులు చెబుతున్నారు.

జోరుగా పారిశుధ్య పనులు


పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్న సర్పంచ్ భారతి చిన్నస్వామి

వెదురుకుప్పం: మండలంలోని తిరుమలయ్యపల్లి గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ భారతి మునస్వామి ఆధ్వర్యంలో జోరుగా పారిశుధ్య పనులు నిర్వహించారు. పంచాయతీలోని రోడ్డుకు ఇరువైపులా ముళ్లచెట్లు, పిచ్చిమొక్కలను జేసీబీ సహాయంతో శుభ్రం చేశారు. గ్రామ పంచాయతీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమానికి ఈఓపీఆర్‌డీ పురుషోత్తం, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు ఇవ్వకుంటే నిరసన


ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

నగరి: గ్రీన్ అంబాసిడర్లకు పెండింగ్ జీతాలు ఇవ్వకుంటే ఈ నెల 14వ తేదీన జడ్పీ కార్యాలయం ముందు నిరసన దీక్ష చేపడతామని ఏపీ గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్. శ్రీరాములు తెలిపారు. చిత్తూరు జిల్లా వ్యాప్తంగా పని చేస్తున్న స్వచ్ఛభారత్ గ్రీన్ అంబాసిడర్ కార్మికులకు గత 12 నెలల జీతాలు చెల్లించాలని, నిలిపివేసిన కార్మికులను పనిలోకి చేర్చుకోవాలని కోరుతూ స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆర్డీఓ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని గ్రీన్ అంబాసిడర్ కార్మికులకు పెండింగ్ జీతాలను చెల్లించాలని, నిలిపివేసిన కార్మికులను పనిలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఈ నెల నవంబర్ 14 నుండి జడ్పీ కార్యాలయం ముందు నిరసన దీక్ష చేపడుతామని హెచ్చరించారు. జిల్లా నాయకులు రాజేంద్ర, సభ్యులు ఏసు పాదం, దేశప్ప, జ్ఞానమణి, మారన్, కుమారి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు


మాట్లాడుతున్న డీసీ విజయ్‌శేఖర్

కార్వేటినగరం: మద్యం అమ్మకాల్లో నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, నిబంధనల మేరకే మద్యం అమ్మకాలు జరపాలని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ తలమాల విజయశేఖర్ హెచ్చరించారు. బుధవారం కార్వేటినగరం ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిబంధనల మేరకు ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయించాలని, దుకాణాల ఎదుట ధరల పట్టిక తప్పనిసరిగా ఉండేలా చూడాలని సూచించారు. తమిళనాడు, కర్ణాటక మద్యం ఒక్క బాటిల్ కలిగిఉన్నా వారిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామని పేర్కొన్నారు. గ్రామాల్లో సారా తయారీ, అమ్మకాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే యువత ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించాలని పిలుపునిచ్చారు. డిప్యూటీ కమిషనర్ వెంట ఎక్సైజ్ సీఐ శిరీషాదేవి, ఎస్‌ఐలు శ్రావణ్ తేజ్, మోసస్, సిబ్బంది ఉన్నారు.

పుత్తూరులో..

పుత్తూరు: మద్యం ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని, బ్రాండ్ల ధరలకు సంబంధించిన బోర్డులు దుకాణాల వద్ద ఏర్పాటు చేయాలని చిత్తూరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టి.విజయ్‌శేఖర్ స్పష్టం చేశారు. బుధవారం పుత్తూరు ఎక్సైజ్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో సీఐ బి.మురళిమోహన్, ఎస్‌ఐలు పి.శివప్రసాద్, ఎస్.అంజాద్‌బాషా పాల్గొన్నారు.

ప్రత్యక్ష అనుభవం కోసమే ఇంటర్న్‌షిప్


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ వేణుగోపాల్

నగరి: నూతన విద్యావిధానంలో అంతర్భాగమైన ఇంటర్న్‌షిప్ ద్వారా విద్యార్థులకు పరిశ్రమలతో ప్రత్యక్ష అనుభవం ఏర్పడుతుందని నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్ తెలియజేశారు. బుధవారం కళాశాలలో కెరీర్ గైడెన్స్ విభాగం, ఐక్యూ విభాగం, సత్యా ఇన్ఫోటెక్ కంపెనీ సంయుక్తంగా నిర్వహించిన ×ఇంటర్న్‌షిప్‌పై అవగాహన్ల కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు అవగాహన ఏర్పరిచారు. ఇంటర్న్‌షిప్ ద్వారా విద్యార్థులు పరిశ్రమలకు వెళ్లి పనితీరు పరిశీలించడం ద్వారా పని సంస్కృతిని అలవర్చుకుంటారన్నారు. కార్యక్రమంలో కళాశాల కెరీర్ గైడెన్స్ విభాగం అధిపతి రేవతి, సత్యా ఇన్ఫోటెక్ ప్రతినిధి హేమంత్, వైస్ ప్రిన్సిపల్ భాస్కర రాజు, ఐక్యూ కో–ఆర్డినేటర్ ఇందిరా ప్రియదర్శిని, జేకేసీ కో–ఆర్డినేటర్ పంకజ, శ్రీలక్ష్మి, మునికుమారి, హరికృష్ణ, లాల్ బాషా, ఇతర అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ప్రతిభ చాటితే ప్రోత్సాహకం

- 7, 10 విద్యార్థులకు మెరిట్ టెస్ట్
- సత్తాచాటిన వారికి బహుమతులు
- రిజిస్ట్రేషన్‌కు ఈ నెల 14 తుది గడువు


పాఠశాలలో విద్యార్థులు

కార్వేటినగరం: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వంతో పాటు పలు ఎన్‌జీఓ ఆర్గనైజేషన్లు ఏటా వివిధరకాల పరీక్షలు నిర్వహిస్తుంటాయి. ఇదే తరహాలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎడ్యుకేషనల్ ఎఫిపని అనే సంస్థ మెరిట్ టెస్ట్(ఈఈఎంటీ)ను ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నిర్వహించనుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 7, 10 తరగతుల విద్యార్థులకు ఆన్‌లైన్‌లో ఈ పరీక్షలు నిర్వహిస్తారు. గత పన్నెండేళ్లుగా ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో నిర్వహించే ఈ పరీక్షకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు గత నెల 15న షెడ్యూల్ విడుదల చేశారు.

రెండు దశలు

ఈఈ ఎంటీ పరీక్షను ప్రిలిమ్స్, మెయిన్ అనే రెండు దశల్లో నిర్వహిస్తారు. విద్యార్థులు తమ ఇష్టం ప్రకారం ఇంటి నుంచే లేదా పాఠశాల నుంచి హాజరయ్యే అవకాశం కల్పించారు. కోడ్ తంత్ర అనే సాఫ్ట్‌వేర్ ద్వారా పరీక్ష జరుగుతుంది. షెడ్యూల్ ప్రకారం డిసెంబరు 29వ తేదీన ప్రిలిమినరీ పరీక్ష నిర్వహిస్తారు. అందులో 40 శాతం పైబడి మార్కులు పొందడంతోపాటు, ఆన్‌లైన్ పరీక్ష నియమ నిబంధనలు సక్రమంగా పాటించినవారు మెయిన్ పరీక్షకు అర్హత పొందుతారు. ఆ పరీక్ష వచ్చే ఏడాది జనవరి 19న జరుగుతుంది. దానిలో 50 శాతం మార్కులు పొంది, ఆన్‌లైన్ నిబంధనలు కచ్చితంగా పాటించిన వారికి నగదు బహుమతులు అందజేస్తారు.

బహుమతులు

పరీక్షలో రాష్ట్ర వ్యాప్తంగా 162 మందిని ఎంపిక చేసి రూ.9 లక్షల విలువైన నగదు బహుమతులు అందించనున్నారు. 10వ తరగతివారికి ప్రథమ బహుమతిగా రూ.30 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.25 వేలు, తృతీయ బహుమతిగా రూ.20 వేలు అందిస్తారు. రాష్ట్ర స్థాయిలో 7వ తరగతిలో రూ. 20 వేలు, రూ. 15, రూ.10 వేలు చొప్పున అందజేస్తారు. జిల్లా స్థాయిలో కూడా నగదు బహుమతులు అందించనున్నారు. ప్రథమ, స్థానం పొందిన వారికి జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి ప్రశంసా పత్రాలను, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి ప్రశంసా పత్రాన్ని అందిస్తారు. ఇతర వివరాలకు 9441575117 నంబర్‌ను సంప్రదించాలి. ప్రిలిమ్స్ రాసేవారికి వచ్చే ఏడాది జనవరి 10న మాక్ టెస్టులు రాసే అవకాశం కల్పిస్తారు. httpr:educationaepiphany.orfeemt2024/refirtration.php లింక్ ద్వారా ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 14 లోపు దరఖాస్తు చేసుకోవాలి.

సద్వినియోగం చేసుకోవాలి



ఎడ్యుకేషనల్ ఎఫిపని సంస్థ నిర్వహించే ఆన్‌లైన్ పరీక్షలను ఆసక్తి కలిగిన 7, 10 విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. రాష్ట్ర స్థాయిలో తమ ప్రతిభను చాటుకుని, సంస్థ అందించే ఆత్యధిక ప్రోత్సాహక బహుమతులను అందుకోవాలి. విద్యార్థులను ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంలు ప్రోత్సహించాలి.

– ఎం. విజయకుమార్, మండల విద్యాశాఖ అధికారి, కార్వేటినగరం

కప్పేసిన పొగమంచు


మండలంలోని అన్ని ప్రాంతాలను బుధవారం పొగమంచు కప్పేసింది. ఉదయం రెండు రోజులుగా 8.30 గంటలైనా సూర్య కిరణాలు భూమిపై పడకుండా మహిళలు ఇంటి ముందు కళ్లాపి చల్లేందుకు, ముగ్గులు వేసేందుకు ఇబ్బందులు పడ్డారు. రోడ్డుపై వాహనాలు లైట్ల వెలుగులోనే నడిచాయి. ఈ మంచు కారణంగా వరి, వేరుశనగ పంటల్లో తెగుళ్లు తప్పవని రైతులు భావిస్తున్నారు.

- పాలసముద్రం